క్లుప్తంగా

ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన



తిరువూరు: సిటిజన్ ఔట్‌రీచ్ కార్యక్రమంతో ప్రభుత్వం అమలు చేసే పథకాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ సచివాలయ సిబ్బందిని కోరారు. తిరువూరు 10వ నంబరు సచివాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల జాబితాలు అప్‌డేట్ చేయాలని సూచించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కోరారు.

మృతుని నేత్రాలు దానం



సీతారామిరెడ్డి(ఫైల్)

గోసవీడు(గంపలగూడెం): మండలంలోని గోసవీడుకు చెందిన సానికొమ్ము సీతారామిరెడ్డి(65) మంగళవారం మృతి చెందాడు. లయన్స్ క్లబ్, పతంజలి చారిటబుల్ ట్రస్టు విజ్ఞప్తి మేరకు మృతుని కుటుంబీకులు నేత్రదానానికి అంగీకరించడంతో ఖమ్మం నేత్రనిధికి చెందిన వైద్యుడు వచ్చి మృతుని నేత్రాలను సేకరించారు.

ఆర్టీసీ బస్సుకు త్రుటిలో తప్పిన ప్రమాదం

గోసవీడు(గంపలగూడెం): ఎన్టీఆర్ జిల్లా తిరువూరు డిపోకు చెందిన బస్సుకు మంగళవారం ప్రమాదం త్రుటిలో తప్పింది. సేకరించిన సమాచారం ప్రకారం ఇలా ఉన్నాయి. తిరువూరు నుంచి కంచికచర్ల మీదుగా విజయవాడ వెళ్లిన ఆర్టీసీ బస్సు తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురైంది. గంపలగూడెం మండల గోసవీడు దాటిన తర్వాత బస్ అదుపు తప్పి పక్కకు దూసుకువెళ్లింది. బస్సు స్టీరింగ్ రాడ్ వదిలేయడంతో కంట్రోల్ తప్పింది. డ్రైవర్ ఎస్‌వీఆర్ బాబు చాకచక్యంగా వ్యవహరించి ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా బస్సును అదుపు చేసి నిలిపివేసినట్లు తెలిపారు. లేని పక్షంలో బస్సు పల్టీలు కొట్టేదని ప్రయాణికులు వివరించారు.

సచివాలయం తనిఖీ చేసిన ఎంపీడీఓ

విస్సన్నపేట: మండలంలోని చంద్రుపట్ల గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ మంగళవారం తనిఖీ చేశారు. సచివాలయాల ద్వారా ప్రజలకు అందించే సేవలు సకాలంలో అందించాలని, అర్హులైనవారికి సంక్షేమ పథకాలను సక్రమంగా అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.బాలకొండయ్య, పంచాయతీ కార్యదర్శి బి.మురళి పాల్గొన్నారు.

శ్రీగంధం మొక్కల చోరీ

ముసునూరు: పదేళ్లుగా పెంచుతున్న శ్రీగంధం మొక్కలను దుండగులు అర్ధరాత్రి నరికి అపహరించుకుపోయిన ఘటన మండలంలోని కాట్రేనిపాడులో జరిగింది. మండలంలోని కాట్రేనిపాడుకు చెందిన కొండెపాటి వెంకటసుబ్బారావు తన రెండెకరాల పొలంలో పదేళ్ల క్రితం ఆయిల్ పామ్ మొక్కలతో పాటు యాభై సెంట్లలో శ్రీగంధం మొక్కలు నాటాడు. గ్రామంలో ఇటీవల జరిగిన జంట హత్యల నేపథ్యంలో పొలం వైపునకు రైతు రాకపోవడంతో ఇదే అదునుగా సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు 30 శ్రీగంధం మొక్కలను సగానికి నరికి పాడు చేసి, 27 మొక్కలను పూర్తిగా నరికి అపహరించుకు పోయారు.

దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి

తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి



తిరువూరు 9వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: పట్టణంలో దీర్ఘకాలంగా నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి తెలిపారు. తిరువూరులోని 9వ వార్డులో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో రక్షిత మంచినీటి సరఫరాకు కృష్ణా నదీ జలాలను అందించే పైలట్ ప్రాజెక్టు చేపట్టామని, అన్ని వార్డులలో సీసీ రహదారులు నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే వెల్లడించారు. తిరువూరు నగర పంచాయతీలో అభివృద్ధి పనుల నిర్వహణకు గడపగడపకు మన ప్రభుత్వంలో వచ్చిన సమస్యలను పరిగణనలోకి తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే నాలుగు వార్డులలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. త్వరలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ కూడా ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. పలు పథకాలలో లబ్ధి పొందిన కుటుంబాలను కలిసి వారికి చేకూరిన ప్రయోజనాలతో కూడిన బ్రోచర్లను అందజేశారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, వార్డు కౌన్సిలర్లు వెంకటరెడ్డి, దుర్గారావు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, ప్రకాష్‌రెడ్డి, ప్రసాద్, శేఖర్‌బాబు, సుందరకుమార్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ విజయలక్ష్మి, నడింతిరువూరు, ముష్టికుంట్ల పీఏసీఎస్ చైర్‌పర్సన్లు గజ్జల సీతారామారావు, బండి రవికుమార్, నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

చదువులో వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ

డీవైఈఓ గౌరీశంకర్

గంపలగూడెం: తక్కువ శ్రేణి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపి పరీక్షలలో మెరుగైన మార్కులు పొందేలా చూడాలని డీవైఈఓ గౌరీశంకర్ సూచించారు. గంపలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కువ రోజులుగా బడికి హాజరు కాని పిల్లల తల్లిదండ్రులను కలసి క్రమం తప్పకుండా బడికి వచ్చేలా చూడాలన్నారు. 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన బైజూస్ ట్యాబ్‌లను సక్రమంగా వినియోగించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం పథకం మెనూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం కచ్చితంగా అమలు చేయాలన్నారు. అనంతరం పాఠశాలలో కొనసాగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణం పనులను పరిశీలించి తగిన నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. రికార్డులు, రిజిస్టర్‌లను పరిశీలించారు. అసెంబ్లీ నిర్వహణలో నిబంధనలు పాటించాలన్నారు. ఉపాధ్యాయులు సులభరీతిలో విద్యాబోధన గావించి విద్యార్థులకు అర్థమయ్యేలా చూడాలన్నారు. హెచ్‌ఎం జమలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాడి రైతు సంక్షేమానికి కృషి

ఊటుకూరు/తునికిపాడు(గంపలగూడెం): పాడి రైతుల సంక్షేమం కోసం కృష్ణా మిల్క్ యూనియన్ నిరంతరం పనిచేస్తుందని యూనియన్ జిల్లా చైర్మన్ చలసాని వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని తునికిపాడు, ఊటుకూరు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల్లో పాలకవర్గ సభ్యులు, పాడి రైతులతో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి రైతులు పాల ఉత్పత్తి పెరిగేందుకు గిట్టుబాటు రేటు పొందటానికి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలు అభివృద్ధికి పలు సూచనలు ఇచ్చారు. పాడి పశువులకు కాల్షియం, పశువులు ఎదకు రావటానికి సబ్సిడీపై సరఫరా చేసే సెమన్ ఉపయోగించుకోవాలన్నారు. తద్వారా పుట్టే దూడలు నాణ్యమైన, ఆరోగ్యకరమైన దూడలు పుడతాయని, పాల దిగుబడి కూడా అధికంగా ఉంటుందని తెలియజేశారు. జిల్లా ట్రస్ట్ సభ్యులు పి.సత్యనారాయణ, మేనేజర్ టి.సాంబశివమూర్తి, సహకార సంఘం పాలకవర్గ సభ్యులు, పాడి రైతులు పాల్గొన్నారు.

ట్యాబ్‌లు సద్వినియోగం చేసుకోవాలి

చిలుకూరివారిగూడెం(మైలవరం): ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి రేణుక తెలిపారు. మైలవరం మండలం చిలుకూరివారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె సందర్శించారు.

ఈ ఏడాది పదవ తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఎంతో కృషి చేస్తోందన్నారు. ఇంటి వద్ద తల్లిదండ్రులు కూడా తమ బిడ్డల చదువు విషయంలో శ్రద్ధ తీసుకోవాలన్నారు. బడి బయటి పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖాధికారిని సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాఘవేంద్ర ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూజివీడులో కుష్ఠువ్యాధి నివారణ పక్షోత్సవాలు

నూజివీడు: నూజివీడు పట్టణంలో జాతీయ కుష్ఠు నివారణ పక్షోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి నుంచి చేపట్టిన అవగాహన ర్యాలీని పీపీ యూనిట్ వైద్యాధికారి గంగాధర కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. నూజివీడులో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నుంచి ప్రధాన రహదారుల వెంబడి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ గంగాధర కుమార్, లేప్రా సొసైటీ కౌన్సిలర్ ఎం.నాగరాజు మాట్లాడుతూ స్పర్శ లేని మచ్చలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ప్రాథమిక దశలో కుష్ఠు వ్యాధిని గుర్తిస్తే అంగవైకల్యం ఏర్పడకుండా వైద్య సేవలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రవికుమార్, శ్రావణి, శశిరేఖ, ఎంపీ మంగాయమ్మ, అనసూయమ్మ, నక్షత్రమ్మ, సంపూర్ణదేవి, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బాధ్యతతో విధులు నిర్వహించాలి

ఆగిరిపల్లి: సచివాలయ సిబ్బంది విధులు బాధ్యతగా నిర్వహించాలని ఎంపీడీఓ కె.వాణి అన్నారు. ఆగిరిపల్లి సచివాలయంలో సచివాలయ సిబ్బందితో ఆయా శాఖల పని తీరుపై సమీక్ష సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన సర్వేను వేగవంతం చేయాలని, ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ సర్వేను ఈ నెల 10లోపు పూర్తి చేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని ఎంపీడీఓ పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి బి.ప్రసాద్, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ షేక్ అబ్దుల్ సలాం పాల్గొన్నారు.

11న కంచికచర్లలో ఎస్టీయూ సదస్సు

రెడ్డిగూడెం: ఎస్టీయూ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన కంచికచర్ల ఓసీ క్లబ్‌లో విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అనే అంశంపై విద్యా సదస్సు జరుగుతుందని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అనుగ్రహ ప్రసాద్ తెలిపారు. ఈ సదస్సుకు ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర నాయకులు, జిల్లా అధికారులు హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా రెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సమావేశ కరపత్రాన్ని ఆవిష్కరించారు.

పెట్రోల్ బంకుల తనిఖీ

గంపలగూడెం: గోసవీడు, గంపలగూడెం హిందుస్తాన్ పెట్రోలియం బంకులు రెండింటిని అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. హిందుస్తాన్ పెట్రోలియం సేల్స్ ఆఫీసర్ కెవిన్ హెటీవ్, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి ఆయా బంకులలో స్టాక్ రిజిస్టర్లు, స్టాకు, పెట్రోల్, డీజిల్ క్యాంటిటీ, క్యాలిటీలను పరిశీలించారు. టాయిలెట్లు, గాలిమిషన్లను ఏర్పాటు చేయా లని డీలర్లకు సూచించారు. తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కమిషనర్ భాను ప్రసాద్, పీడీఎస్‌డీటీ నాగరాజు, వీఆర్‌ఓ ప్రతాప్ పాల్గొన్నారు.

సభ్యుల ఆమోదంతో నిధుల పంపిణీ

చాట్రాయి: మండల పరిషత్ సభ్యుల ఆమోదం మేరకు మండల పరిషత్ నిధులు ఖర్చు చేస్తున్నట్లు ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ లంకా నిర్మల మాట్లాడుతూ ప్రతి సమావేశానికి ముందు రోజు ఎంపీడీవో తమతో చర్చించి తాము ఆమోదం తెలిపిన తరువాత గ్రామాలకు నిధులు పంపిణీ చేస్తున్నారని చెప్పారు. 2021–23 వరకు జనరల్ ఫండ్ రూ.41.56 లక్షలు రాగా రూ.32.72 లక్షలు ఖర్చు చేయగా ఇంకా రూ.8.84 లక్షలు మిగులు ఉందని, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.04.కోట్లు రాగా ఇందులో రూ.76.57 లక్షలు ఖర్చు చేయగా ఇంకా రూ.28.38 లక్షలు మిగులు ఉందని ఆమె వివరించారు. సభ్యులకు తెలియకుండా మండల పరిషత్ నిధులు ఖర్చు చేస్తున్నారని ఒక దినపత్రికలో వచ్చిన వార్త అవాస్తవమని అన్నారు. అందరి ఆమోదంతోనే నిధులు గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేస్తున్నట్టు స్పష్టం చేశారు.

కార్యక్రమంలో ఎంపీపీ లంకా నిర్మల, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి, చల్లగుళ్ల జగన్‌మోహనరావు, ఎంపీటీసీ సభ్యులు చింతగంట్ల వెంకటేశ్వరరావు, పోతురెడ్డిపల్లి కృష్ణ, దార్ల సోనీ ఆనంద్, సంకు శివకుమారి, మోరంపూడి స్వరూపరాణి, కంచర్ల వెంకయ్య, యల్లంకి సుజాత, బాణావతు భారతమ్మ, సౌజన్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉగాదికి జగనన్న కాలనీ ఇళ్లలో గృహప్రవేశాలు



జక్కంపూడిలో జగనన్న కాలనీ ఇళ్లను పరిశీలిస్తున్న ఏఈ రామకృష్ణ

విజయవాడరూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉగాది పండుగ నాడు జగనన్న కాలనీ ఇళ్లలో గృహప్రవేశాలు జరుగుతాయని గృహ నిర్మాణ శాఖ ఏఈ రామకృష్ణ తెలిపారు. మండలంలోని జక్కంపూడి, కొత్తూరు తాడేపల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలను మరింత వేగవంతం చేసి ఉగాది నాటికి పూర్తి చేయాలని ఆయన లబ్ధిదారులకు సూచించారు.లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు అవసరమైన సదుపాయాలను ప్రభుత్వం కల్పించిందన్నారు. జక్కంపూడి గ్రామంలో 387 గృహాలను ప్రభుత్వం మంజూరు చేయగా వాటిలో 44 పూర్తి కాగా, 340 గృహాలు వివిధ స్టేజిల్లో నిర్మాణంలో ఉన్నాయని, కొత్తూరు తాడేపల్లి గ్రామంలో 376 గృహాలను ప్రభుత్వం మంజూరు చేయగా వాటిలో 49 గృహాలు పూర్తయ్యాయని, 308 గృహాలు నిర్మాణంలో ఉన్నాయని ఏఈ తెలియజేశారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి ఇళ్ల నిర్మాణాలు స్పీడుగా జరిగేలా చూడాలని అన్నారు.

మానవత్వం చాటుకున్న మైలవరం ఎస్ఐ



గాయపడిన యువకులను మైలవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించిన ఎస్ఐ రాంబాబు

మైలవరం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకులను తన వాహనంలో ఆస్పత్రికి తరలించి మైలవరం ఎస్ఐ రాంబాబు మానవత్వం చాటుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం నుంచి సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై విజయవాడలోని కృష్ణలంక వెళుతున్న ఇద్దరు యువకులు మైలవరం మండలం చంద్రగూడెం వద్ద డివైడర్‌ను ఢీకొని ప్రమాద స్థితిలో రోడ్డుపై పడి ఉన్నారు. అదే సమయంలో మైలవరం మండలం బొర్రగూడెం వద్ద బందోబస్తు నిమిత్తం డ్యూటీ నిర్వహిస్తున్న ఎస్ఐ ప్రమాదం జరిగిన విషయం తెలుసుకుని వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన ఇద్దరు యువకులను తన వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందించి, ప్రాణాపాయ స్థితి నుంచి వారిని కాపాడారు.

బీజేపీ మండల కార్యవర్గ సమావేశం

నూజివీడు: ఎన్నికల సమయం దగ్గరపడుతున్నందున బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరింత ఉత్సాహంగా పనిచేయాలని బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు కోర్లశ్ల సుధాకర్ కృష్ణ అన్నారు. మండలంలోని గొల్లపల్లిలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశాన్ని మంగళవారం అధ్యక్షుడు గోగినేని శ్రీనివాస కుమార అప్పారావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పార్టీ నిర్ణయించిన కార్యక్రమాలపై నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పూర్తిస్థాయి బూత్ కమిటీలను నిర్మించాలని, శక్తి కేంద్రాలను పటిష్టం చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లిపూడి రాజశేఖర్, ఉపాధ్యక్షుడు కృష్ణారావు, సీనియర్ నాయకుడు వైఎస్ దొరై, పట్టణ కార్యదర్శి మాగంటి వాసు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకురాలు వీరమ్మ మృతి

నూజివీడు: సమాజ సేవకురాలు, రమాబాయి అంబేడ్కర్ మహిళా సంఘం పట్టణ అధ్యక్షురాలు, బత్తుల వీరమ్మ(86) సోమవారం రాత్రి మృతి చెందారు. ఈమె కొంతకాలంగా అస్వస్థతతో బాధపడుతున్నారు. వైద్యశాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వీరమ్మ సీనియర్ సిటిజన్ అసోసియేషన్‌లో, రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్‌లో చురుకైన పాత్ర పోషించారు. రమాబాయి అంబేడ్కర్ మహిళా సంఘాన్ని స్థాపించి పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. వీరమ్మకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వీరంతా ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. వీరమ్మ మృతి చెందిన విషయం తెలిసి పామర్రు మాజీ ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన, పట్టణంలోని పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు వీరమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

వైభవంగా అంకమ్మ తల్లి వార్షికోత్సవం

నూజివీడు: పాతరావిచర్లలో బెజవాడ వారి ఇలవేల్పు అంకమ్మ తల్లి ఆలయ ఐదో వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి వేద పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వైఎస్సార్ సీపీ నూజివీడు యువ నాయకులు మేకా వెంకట వేణుగోపాల అప్పారావు (చంటినాయన), కృష్ణాజిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ మాదు శివరామకృష్ణ, నూజివీడు, గన్నవరం ఎంపీపీలు ఆరేపల్లి శిరీష, అనగాని రవి, వైఎస్సార్ సీపీ నూజివీడు పట్టణ అధ్యక్షుడు శీలం రాము అమ్మవారిని దర్శించుకుని అన్న సమారాధనలో పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయ పాలకవర్గ సభ్యుడిగా శ్రీనివాస్

కిలేశపురం(ఇబ్రహీంపట్నం): విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం పాలకవర్గ సభ్యునిగా మండలంలోని కిలేశపురం గ్రామానికి చెందిన చింకా శ్రీనివాసరావు మంగళవారం ఆలయంలో జరిగిన ప్రమాణస్వీకార మహోత్సవంలో ప్రమాణ స్వీకారం చేశారు. పాలకవర్గ సభ్యుడిగా తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రీనరీ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ పోలగంగు రాణి, సర్పంచి కాకి దేవమాత, వైస్ ఎంపీపీ బాణావత్ నాగబాలమ్మ, గ్రామ కార్యదర్శి మునేశ్వరరావు, బాణావత్ బాలాజీ, కాకి రాఘవులు శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు.

చీపురుగూడెంలో వైద్య శిబిరం

చాట్రాయి: మండలంలోని చీపురుగూడెంలో మంగళవారం చింతలపూడి సాయి స్ఫూర్తి ఆస్పత్రి వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 200 మందికి వైద్య సేవలందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు పి.రామకృష్ణ, మణికంఠ, ఆర్.భవ్య, పి.రవీంద్ర, వైఎస్సార్ సీపీ నాయకులు ఓబిళ్లనేని వెంకటేశ్వరరావు, చీకటి శ్రీనివాసరావు, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

తలశిల స్వర్ణకుమారికి ఘన నివాళులు



రఘురామ్‌ను పరామర్శిస్తున్న గౌతంరెడ్డి, బ్రహ్మానందరెడ్డి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ సతీమణి స్వర్ణకుమారి ఇటీవల అనారోగ్యంతో కన్ను మూసిన సంగతి విదితమే. ఈ క్రమంలో మంగళవారం గొల్లపూడిలోని రఘురామ్ నివాసానికి వచ్చి స్వర్ణకుమారి చిత్రపటానికి పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. స్వర్ణకుమారికి నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యేలు సామినేని ఉదయభాను, వసంత కృష్ణప్రసాద్, కైలే అనిల్‌కుమార్, జొన్నలగడ్డ పద్మావతి, అన్నా రాంబాబు, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఏపీ కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ పూనూరి గౌతంరెడ్డి, బత్తుల బ్రహ్మానందరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్‌బీకే నిర్మాణ పనులు పరిశీలన

నరసాపురం (విస్సన్నపేట): మండలంలోని నరసాపురం గ్రామంలో నిర్మిస్తున్న రైతుభరోసా కేంద్రం భవనాన్ని పంచాయతీరాజ్ డీఈ చక్రవర్తి మంగళవారం పరిశీలించారు. మండలంలో 15 సచివాలయాల పరిధిలో ఆర్‌బీకేల నిర్మాణాలు చేపట్టామని, నిర్మాణ పనులు వివిధ దశలలో ఉన్నాయన్నారు. పీఆర్ ఏఈ దైవసహాయం, గ్రామ ప్రముఖుడు కాసర చెన్నారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ప్రతిష్ఠా మహోత్సవాలు

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): కొటికలపూడిలో శ్రీదాసాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పలు దేవతా విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాల పూజా కార్యక్రమాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయం ప్రతిష్ఠతో పాటు శ్రీమహాగణపతి, శ్రీకుమారస్వామి, దాసాంజనేయస్వామి, ఆలయ శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలు ఈనెల 9వ తేదీన జరగనున్నాయి. మూడు రోజుల పాటు జరిగే పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆలయ అర్చకులు గోపూజ, విఘ్నేశ్వర పూజ, శిలా ప్రవేశం, అఖండ దీపారాధన , జలాధివాసం నిర్వహించారు.

వైభవంగా సోమయాగం

ఆగిరిపల్లి: మండలంలోని వట్టిగుడిపాడు శివారు అనంతసాగరంలో ఈ నెల 2 నుంచి నిర్వహిస్తున్న శివాంబికా పంచాయతన సహిత సోమయాగం మంగళవారంతో ముగిసింది. మెగా కంపెనీ డైరెక్టర్ ప్రదీప్ పద్మిని దంపతుల ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం, దేశ అభ్యున్నతి కోసం, ధర్మరక్షణార్థం సోమయాగం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

రైతులకు యూరియా కొరత లేదు

నూజివీడు: స్థానిక సబ్ డివిజన్ పరిధిలోని నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాల్లో యూరియాతో పాటు ఇతర ఎరువులు సమృద్ధిగా ఉన్నాయని, ఎలాంటి కొరత లేదని వ్యవసాయశాఖ నూజివీడు సహాయ సంచాలకులు జి.విద్యాసాగర్ మంగళవారం తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఏమాత్రం ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. సోషల్ మీడియాలో, ఇతర మీడియాల్లో చేస్తున్న ప్రచారాన్ని రైతులు నమ్మవద్దని స్పష్టం చేశారు. ఎరువుల వ్యాపారులు ఎమ్మార్పీ కంటే అధిక రేట్లకు విక్రయిస్తున్నారనడం సత్యదూరమన్నారు. ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక రేట్లకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంలో ఎలాంటి సమస్య తలెత్తినా రైతులు 8331056885 నంబరులో సంప్రదించాలని కోరారు.